క్లుప్తంగా

సందడి చేసిన 'కమిటీ కుర్రోళ్లు'



డ్యాన్స్ చేస్తున్న చిత్రం యూనిట్ సభ్యులు

భీమవరం: పట్టణంలో కమిటీ కుర్రోళ్లు చిత్రం యూనిట్ శుక్రవారం సందడి చేసింది. నటరాజ్ థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి చిత్రాన్ని తిలకించిన యూనిట్ సభ్యులు అనంతరం థియేటర్ బయట డ్యాన్స్‌లు చేసి యూత్‌ను ఆకట్టుకున్నారు. సినిమాలో ఒక హీరోగా నటించిన వీరవాసరం మండలం దూసపూడి గ్రామానికి చెందిన శ్యామ్‌కల్యాణ్ మాట్లాడుతూ తాను ఇదే థియేటర్‌లో అనేక మంది హీరోల సినిమాలు చూశానని, అయితే తాను నటించిన చిత్రాన్ని ప్రేక్షకులతో కలిసి ఇదే థియేటర్‌లో చూడడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కమిటీ కుర్రోళ్లు సినిమా అన్నివర్గాల ప్రజలను ఆకట్టుకుంటుందన్నారు.

కాళ్ల ఎస్సైగా శ్రీనివాసరావు

కాళ్ల: కాళ్ల ఎస్సైగా ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడు తూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, జూదం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించి కట్టడి చేస్తామన్నారు.

జలజీవన్ పనుల్లో నిర్లక్ష్యంపై మండిపాటు

ఆకివీడు మండల పరిషత్ సమావేశం



సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈని నిలదీస్తున్న ఎంపీటీసీ సభ్యులు

ఆకివీడు: జలజీవన్ మిషన్ పనుల్లో నిర్లక్ష్యంపై అధికారులపై పలువురు ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతోందంటూ నిలదీశారు. ఎంపీపీ కఠారి జయలక్ష్మి అధ్యక్షతన ఆకివీడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. సమావేశంలో తొలుత ఎంపీపీ మాట్లాడుతూ అన్ని ప్రాంతాలకూ మంచినీటి కుళాయి సౌకర్యం కల్పించాలనే ఆశయంతో జల జీవన్ మిషన్ పథకం అమలులో నిర్లక్ష్యంపై ఆవేదన వ్యక్తంచేశారు. రెండేళ్ల క్రితం కేంద్రం నుంచి జల జీవన్ మిషన్ నిధుల మంజూరుకు అప్పటి సీఎం వైఎస్ జగన్ కృషి చేశారని, దీని వల్ల పలు గ్రామాలకు నిధులు మంజూరయ్యాయన్నారు. పైప్‌లైన్లు ఆయా గ్రామాలకు వచ్చినప్పటికీ పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలకు కుళాయిల ద్వారా మంచినీరు అందడం లేదన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల అలసత్వం వల్లే పనులలో జాప్యం జరుగుతోందన్నారు. ఇదే అంశంపై పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పార్వతిని నిలదీశారు. ఎస్‌ఎంసీల నియామకంలో రాజకీయం జరిగిందని సర్పంచ్ నందమూరి ప్రకాశం ఆరోపించగా, అన్ని పాఠశాలల్లో రాజకీయ ప్రమేయం లేకుండా ఎన్నికలు నిర్వహించామని ఎంఈఓ సీతారామయ్య చెప్పారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. ఏఓ ప్రియాంక మాట్లాడుతూ ఖరీఫ్ నారుమడులు దెబ్బతిన్న ప్రాంతాల్లో మళ్లీ నారు వేసుకునేందుకు 70 శాతం సబ్సిడీపై విత్తనాలను ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ అభితేజ మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా ఇళ్లు నిర్మించుకునేవారికి రూ.4 లక్షలు మంజూరు చేస్తుందని ప్రకటించిందన, అయితే దీనిపై గైడ్‌లైన్స్ ఇంకా రాలేదన్నారు. ఎంపీడీఓ రాధాకృష్ణ, సూపరింటెండెంట్ శ్రీకర్, వైస్ ఎంపీపీ సైదాల సూర్యనారాయణ, విప్ కిల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



కాళ్లకూరు యూపీ స్కూల్లో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వరరావు

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు యూపీ పాఠశాల, దొడ్డనపూడి పరిధిలోని కొత్తచెరువు పాఠశాల లను ఎంఈఓ వి.వెంకటేశ్వరరావు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను బోధించాలని సూచించారు. అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం బోధన జరగాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.రామకృష్ణ, సీఆర్‌ఎంటీ వెంకన్నబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన నాక్ గ్రేడ్ సాధనకు కృషి

ఆకివీడు: దుంపగడపలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఈ నెల 29, 30 తేదీల్లో నాక్ బృందం సందర్శించనున్న నేపథ్యంలో మెరుగైన గ్రేడ్ సాధించేందుకు కృషి చేస్తున్నట్లు కళాశాల అభివృద్ధి, ప్రణాళిక సంఘం కార్యదర్శి డాక్టర్ పీబీ ప్రతాప్ కుమార్ చెప్పారు. శుక్రవారం పూర్వ విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో డీ గ్రేడ్ రావడంతో తక్కువ నిధులు మంజూరయ్యేవన్నారు. ఇటీవల ఎంపీ నిధులు, వివిధ ప్రభుత్వ గ్రాంట్లు, దాతల నిధులు, దాతల సహకారంతో కళాశాల మరింతగా అభివృద్ధి సాధించిందన్నారు. కళాశాల ప్రగతిని తెలియజేయడం ద్వారా నాక్ దృష్టిలో ఏ,బీ గ్రేడ్‌లు సాధనకు పూర్వపు విద్యార్థుల్లు కృషి చేయాలని కోరారు. కళాశాల ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మాజీ రాష్ట్రపతి వీవీ గిరి జయంతిని పురస్కరించుకుని జనవరి 12న గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆదివారం ప్రత్యేక సమావేశానికి అందరూ హాజరుకావాలని కోరారు. నేరెళ్ల రామ చెంచయ్య, చొప్పెర్ల మూర్తి పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలను నివారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో మాతా, శిశు మరణాల నివారణకు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో ఆమె సమీక్షించారు. హైరిస్క్ కేసులు వేరే ఆసుపత్రులకు రిఫర్ చేస్తే సంబంధిత వైద్యాధికారి పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో శిశు సంరక్షణకు అవసరమైన పరికరాల జాబితాను తయారుచేసి అందజేయాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది జూలై నెలాఖరు వరకు రెండు మాతృమరణాలు, ఆరు శిశు మరణాలు నమోదైనట్లు తెలిపారు. కమిటీ సభ్యులు డీఎంహెచ్‌వో డాక్టర్ డి.మహేశ్వరరావు, డీఐఓ డాక్టర్ దేవ సుధా లక్ష్మి, డీసీహెచ్ఎస్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో ప్రగతి కనిపించాలి

జిల్లాలోని ఇళ్ల నిర్మాణాల్లో మెరుగైన ప్రగతి కనిపించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు గృహ నిర్మాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కాలనీలో అంతర్గత రోడ్లను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని సూచించారు. గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి పీడీ పి.పిచ్చయ్య, నరసాపురం ఈఈ బీవీ రమణారావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: పట్టణంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ శుక్రవారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని భీమవరం వన్‌టౌన్, వీరవాసరం మండలం, భీమవరం రూరల్ మండలంలోని కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్టేట్ టోల్ ప్రతిపాదనలు విరమించుకోవాలి

భీమవరం: రాష్ట్ర రహదారులపై టోల్‌టాక్స్ ప్రతిపాదనను ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలి సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే వాహనాల రిజిస్ట్రేషన్స్ సమయంలో లైఫ్ టాక్స్, రోడ్ ట్యాక్స్, గ్రీన్‌ట్యాక్స్, డీజిల్, పెట్రోల్‌పై తదితర రూపాలలో ప్రభుత్వం పన్నులు వసూలు చేస్తోందని, మరలా స్టేట్ టోల్ టాక్స్ విధిస్తే ప్రజలపై విపరీతమైన భారం మోపినట్లవుతుందన్నారు. టోల్‌టాక్స్ కారణంగా లారీలు, ట్రాక్టర్లు వంటి వాహనాల కిరాయి పెరిగి రవాణా రంగంపై మరింత భారం పడి నిత్యావసర వస్తువుల ధరలు మరింత పెరుగుతాయని బలరామ్ ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ తప్పిదాల నుంచి ప్రస్తుత ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోవాలని హితవు పలికారు. టోల్‌టాక్స్ విరమించుకోకపోతే ప్రజాగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు.

కొత్త క్రిమినల్ చట్టాల అమలు నిలిపివేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న న్యాయవాదులు

భీమవరం: కొత్త క్రిమినల్ చట్టాలు అమలు నిలిపివేయాలని కోరుతూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భీమవరం బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం తహసీల్దార్ ఆర్.రాంబాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు కాస్త్రో మాట్లాడుతూ బెంగాల్ ప్రభుత్వం మూడు క్రిమినల్ చట్టాలను అమలుచేసేదిలేదంటూ అసెంబ్లీలో తీర్మానం చేసిన విధంగా మన రాష్ట్రంలో కూడా తీర్మాణం చేయాలన్నారు. యూనియన్ భీమవరం కన్వీనర్ దానం విద్యాసాగర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జూలై ఒకటో తేదిన కొత్త క్రిమినల్ చట్టాలను తీసుకొచ్చిందని, దీని వల్ల వాక్ స్వాతంత్ర్యం, సమావేశమయ్యే హక్కు, నిరసన ప్రదర్శన చేసుకునే హక్కును కోల్పోతారన్నారు. బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎ.ప్రసన్నకుమార్, జ్యోతి, అంబేడ్కర్, రావూరి రాజేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన టూటౌన్ ఎస్సై



ఎమ్మెల్యే అంజిబాబుకు పుష్ప గుచ్ఛం ఇస్తున్న టూ టౌన్ ఎస్సై

భీమవరం: ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)ను రెండో పట్టణ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన గూడూరు వీర్రాజు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో శాంతి భద్రతల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. పట్టణంలోని ట్రాఫిక్‌ను నియంత్రించాలని అన్నారు.

12 నుంచి శిక్షణా తరగతులు

ఉండి: మండలంలోని సర్పంచ్, కార్యదర్శులకు గ్రామ పంచాయితీ పరిపాలనపై ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రవీంద్ర శుక్రవారం తెలిపారు. వెలుగు సమావేశ మందిరంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ, డంపింగ్ యార్డులు, తాగు నీరు, విద్యుద్దీపాలు, పంచాయితీ పాలన వంటి వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అన్ని గ్రామ పంచాయితీల సర్పంచ్‌లు, కార్యదర్శులు విధిగా శిక్షణా కార్యక్రమానికి హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

భీమవరం అర్బన్: దిరుసుమర్రు పంచాయతీలో నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ఈవోపీఆర్‌డీ జేవీ నామేశ్వరరావు శుక్రవారం విచారణ చేపట్టారు. పాలకవర్గం కొలువుదీరిన తరువాత ఏడాదిపాటు సర్పంచ్, కార్యదర్శి ఏ విధమైన రికార్డులు అడిగినా చూపలేదని, నిధులు దుర్వినియోగం అయినట్లు ఉప సర్పంచ్ గంగాధరరాజు ఇటీవల ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదికలో కలెక్టర్, ఆర్డీవోల దృష్టికి తీసుకువెళ్లారు. వారి ఆదేశానుసారం శుక్రవారం ఈవోపీఆర్‌డీ నామేశ్వరరావు పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. దీనిపై నివేదికను వారం రోజుల్లో ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు.

ఇరువర్గాలపై కేసులు

భీమవరం అర్బన్: ఇంటి సరిహద్దు విషయమై జరిగిన ఘర్షణపై ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తోకతిప్ప గ్రామంలో బొడ్డు ఏసురాజు, పొన్నాల యేసేబురాజు పక్క పక్క ఇళ్లల్లో నివసిస్తున్నారు. వీరిద్దరి మధ్య సరిహద్దు స్థల విషయమై వివాదం జరగడంతో ఘర్షణకు దిగారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు రూరల్ హెచ్‌సీ పి.మహేశ్వరరావు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రంథాలయానికి నవ దంపతుల కానుక

పాలకోడేరు: కుముదవల్లిలోని శ్రీవీరేశలింగం కవి సమాజ గ్రంథాలయానికి నూతన వధూవరులు రూ.1లక్షా 116 కానుకగా సమర్పించారు. వివరాల్లోకి వెళితే.. స్వాతంత్ర్యోద్యమ చరిత్ర ఉన్న ఈ గ్రంథాలయానికి గ్రామంలో ఏ ఇంట పెళ్లి జరిగినా కానుక సమర్పించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఈ నెల 7న దినేష్ వర్మ, గీతా సాయి నాగమానస వివాహం కాగా, కొత్త జంట కానుక సమర్పించారని గ్రంథాలయ కమిటీ కార్యదర్శి నాగేంద్రవర్మ తెలిపారు.

విజయ కనకదుర్గమ్మకు సారె సమర్పణ





కోమటిగుంటలో అమ్మవారికి సమర్పించిన సారె, సారెతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళలు

కాళ్ల: కోమటిగుంట గ్రామంలో వేంచేసియున్న శ్రీ విజయకనకదుర్గమ్మ అమ్మవారికి శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా గ్రామస్తులు శ్రావణ మాస సారె సమర్పించారు. అమ్మవారికి 11 రకాల స్వీట్స్, పువ్వులు, పసుపు, కుంకుమ, గాజులు, పండ్లను గ్రామంలోని కోదండరామాలయం వద్ద నుంచి సుమారు 150 మంది మహిళలు మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎంతో మహిమలు కలిగిన అమ్మవారికి గత నాలుగు ఏళ్లుగా ప్రతి ఏటా శ్రావణమాసం తొలి శుక్రవారం నాడు సారె సమర్పించడం ఆనవాయితీ అన్నారు. భక్తుల సహకారంతో శుక్రవారం అమ్మవారికి తొమ్మిది రకాల పట్టుచీరలతో అలంకరణ చేసి సారె సమర్పించామని తెలిపారు. ఈనెల 14వ తేదీన నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అనంతరం ఆఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని వివరించారు. మాజీ సర్పంచులు యలమంచిలి వెంకటరమణ, రామాంజనేయులు, గణపతి, రామాలయం కమిటీ సభ్యులు మంతెన నాగాంజనేయులు, గుర్రం సత్యనారాయణ, పులమంతుల యేసురాజు, వీసం శ్రీను, యలమంచిలి బాబ్జి పాల్గొన్నారు.

క్విట్ కార్పొరేట్ నినాదంతో నిరసన ర్యాలీ

భీమవరం: పట్టణంలో రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్ నినాదంతో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ కార్యాలయం నుంచి ప్రకాశం చౌక్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెఎన్‌వీ గోపాలన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు దేశాన్ని తాకట్టు పెడుతోందని, దీని వల్ల కార్మిక, కర్షక, శ్రామిక ప్రజలు ఉపాధి, గిట్టుబాటు ధర, కనీస వేతనాలు లేక, పెరుగుతున్న ధరలు భరించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్పొరేట్లకు అనుకూలమైన పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. జక్కం శెట్టి సత్యనారాయణ, ఆనంద్, డి కళ్యాణి పాల్గొన్నారు.

శ్రీలలిత విష్ణు వైభవం పుస్తకాల పంపిణీ

భీమవరం (ప్రకాశం చౌక్): ఉపాసనాపరంగా, తత్వపరమైన వైదిక అంశాలతో నిండిన శ్రీలలిత విష్ణు సహస్ర నామ స్తోత్రమ్ గ్రంథాన్ని భక్తులకు శ్రావణమాసంలో పంపిణీ చేయడం మహాభాగ్యమని మావుళ్లమ్మ దేవస్థానం ఈఓ బుద్ధ మహాలక్ష్మి నగేష్ అన్నారు. శ్రీశైల దేవస్థానం ప్రత్యేక సలహాదారులు పురాణపండ శ్రీనివాస్ రచించిన శ్రీలలిత విష్ణు సహస్ర నామ స్తోత్రమ్ దివ్య గ్రంథాన్ని శ్రావణమాస తొలి శుక్రవారం మావుళ్లమ్మ ఆలయంలో ఆయన ఆవిష్కరించి తొలి ప్రతిని ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మకి అందజేశారు. శుక్రవారం అర్చనల్లో పాల్గొన్న మహిళలకు ఈ గ్రంథాన్ని అందించారు.

అంబేడ్కర్ స్మృతి వనంపై దాడికి నిరసన

భీమవరం (ప్రకాశంచౌక్): విజయవాడలో అంబేడ్కర్ స్మృతి వనంలో విధ్వంసాన్ని నిరసిస్తూ గునుపూడిలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ అంబేడ్కర్ స్మృతి వనంపై దాడి దళితులపై దాడిగా అభివర్ణించారు. బోకూరి విజయరాజు, బలే యేసుబాబు, బుంగా ప్రహ్లాదుడు, మాకిరెడ్డి వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అధికార పార్టీ దుశ్చర్య

పాలకోడేరు: విజయవాడలో అంబేడ్కర్ స్మృతి వనంలో శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కొండేటి లాజరు, బీసీ సంఘం నాయకులు బొక్కా రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో నిరసన వ్యక్తం చేశారు. ఇది అధికార పార్టీ చేసిన దుశ్చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ కక్ష ఉంటే రాజ్యాంగ నిర్మాతపై చూపడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.

మహిళలకు అండగా సఖి వన్‌స్టాప్ సెంటర్లు

పాలకోడేరు: మిషన్ శక్తి పథకం సఖి వన్‌స్టాప్ సెంటర్లు మహిళలకు అండగా నిలవాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత అన్నారు. శుక్రవారం విస్సాకోడేరులో మిషన్ శక్తి పథకం సఖి వన్ స్టాప్ సెంటర్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. లైంగిక హింసకు గురైన మహిళలకు, బాలలకు అందుతున్న అత్యవసర, సత్వర సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైంగిక హింసకు గురైన మహిళలు, బాలికలు టోల్ ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేస్తే సిబ్బంది వెంటనే చర్యలు తీసుకుంటారన్నారు. తొలుత ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజును భీమవరం క్యాంపు కార్యాలయంలో ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. సఖి వన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధి చుక్క ధనలక్ష్మి, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్స్‌పై అవగాహన ర్యాలీ



ఆకివీడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: చదువు మధ్యలో నిలిచిపోయిన వారికి ఓపెన్ స్కూల్ విద్యా విధానం వరం లాంటిదని సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) జిల్లా ఇన్‌చార్జి కో-ఆర్డినేటర్ ఎస్.సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ నుంచి ఓపెన్ స్కూల్స్‌పై అవగాహనా ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి కోసం 25 కేంద్రాలు, ఇంటర్ చదివేందుకు 19 కేంద్రాల్లో ఓపెన్ స్కూల్‌లు నడుస్తున్నాయని చెప్పారు. 14 ఏళ్లు నిండినవారు పదో తరగతి చదివేందుకు, టెన్త్ ఉత్తీర్ణతతో 15 ఏళ్లు నిండిన వారు ఇంటర్ చదివేందుకు అర్హులని చెప్పారు. ఎంఈఓ-2 సీతారామయ్య, ఏపీఓ ఆశీర్వాదం, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, ప్రధానోపాధ్యాయుడు తోట పోతరాజు పాల్గొన్నారు.